

# ముంగిస-పాము అను మనుషుల కథ

సి. కనకాంబరరాజు

చలి. చిక్కని చలి.

వంటిమీద వులెన్ సూటు, చెవులకి మఫ్లర్, కాళ్లకి బూట్లు...

అయినాసరే, చలి... వెచ్చటి చలి...

చుట్టూ చీకటి.

చీకటిని చీలుస్తూ మిణుగురు పురుగులు. గుండెల్లోనుంచి దూసుకుపోయే నిప్పురవ్వల్లా చీల్చుకుపోతున్నాయి.

రోడ్డు కిరువైపులా చేలు. ఈ ప్రశాంతమైన పంట పొలాలమీదుగా వీచే చల్లని గాలి. మంచులాంటి గాలి.

దూరంగా ఎక్కడో నక్కలు అరిచే అరుపులకి కీచురాళ్ల నేపథ్యం! స్వరాలు మఫ్లర్ని దాటి చెవులకి కొద్దికొద్దిగా వినిపిస్తున్నాయి.

రోడ్డుమీద చూడ్డాని కేంలేదు. అంతా చీకటి. దట్టమైన చీకటి.

నా చూపు రోడ్డుమీదనుంచి ఆకాశంలోకి సారించాను.

చీకటిని చీల్చుకుంటూ చుక్కలదాకా పోయింది నా దృష్టి.

చుక్కలు మినుకు మినుకుమంటున్నాయి. నడుస్తుంటే నాకూడా వస్తున్నాయి.

చీకటి రాత్రి.

తోడెవరూ లేరని చుక్కలు జాలి చూపుతున్నాయి. మేమున్నాం రమ్మని దారి చూపుతున్నాయి. తోడు వచ్చే

చుక్కల్ని తలచుకుంటూ-దారి చూపించే చుక్కల్ని చూసుకుంటూ-చీకటిని చీల్చు కుంటూ వెళ్ళిపోతున్నాను.

చూస్తూ చూస్తుండగానే చుక్క తెగింది. తెగిన చుక్క నా కళ్లెదుటే భూమ్మీదికి రాలింది. కళ్లు మిరుమిట్లు గొలిపే ఆ వెలుగు ఎక్కడో భూమిలో పాతుకుపోతుంది. ఇక ఆ చుక్క వెలగదు. లెక్కల్లో మిగలదు

చింపిరిజుట్టు దెయ్యాలు కొలువు తీరినట్టుగా రోడ్డు పక్కన చెట్లు నిల్చున్నాయి. ఆ చింపిగిజుట్టులోనుంచి కళ్లు...?

మెరిసేకళ్లు...

గుడ్లగూబల కళ్లు...!

చలికి చేతులు కొంకర్లు పోతున్నాయి. నాసికారంధ్రాలు అరుకు పోతున్నాయి.

ఒక్కసారిగా యీ నా శరీరం ఎందుకు మెలితిరిగిపోతున్నది? నా ఎముకలు సుళ్లతిరిగి పోతున్నాయేమిటి? నా శరీరం స్వాధీనం తప్పిపోతున్న దేమిటి?

ఇదంతా చలేనా? భయమా?

"ఈ చలి నీకెక్కడ దాపురించి నది..." అర్జునిడితో చెబుతున్న కృష్ణుడు జ్ఞాపకం వచ్చాడు.

అర్జునా...ఫల్గుణా...

ఈ చలి భయంకరమైనది. భయాన్ని మింగిన చలి నన్ను నమి లేస్తున్నది.

ఆకలి దహించుకుపోతోంది. భయమూ-ఆకలీ నా చలిని ఎక్కువ చేస్తున్నాయి.. విపరీతంగా భయ పెట్టేస్తున్నాయి.

భయంలో తడబాటు.

కాళ్లు తడబడుతున్నాయి.

టకటకా చప్పుడు

బూట్లచప్పుడు...

ఆకాశంలో నక్షత్రాలు...తోడువచ్చే నక్షత్రాలు...కాళ్లకిబూట్లు...నిశ్శబ్దాన్ని భేదించే టకటకలు...

ఏదో ధైర్యం . పిచ్చి ధైర్యం...!

కాళ్లు వడివడిగా అడుగులు వేస్తున్నాయి. గమ్యంవైపు నడక సాగిస్తున్నాయి.

రైలు లేటవకపోతే ఎప్పుడో గూటికి చేరి ఉండేవాణ్ని. రైలును తిట్టు కున్నాను.

అయినా, ఈ పెళ్ళి చూపులకి ఇప్పుడేం తొందరొచ్చింది! అర్ధరాత్రి ముహూర్తం పెళ్ళి చూపులకి కూడానా?

అర్థంలేని ఆలోచనకి నవ్వొచ్చింది.

అర్ధరాత్రి రమ్మని ఎవరన్నారు? తనే అర్థరాత్రి ప్రయాణం చేస్తున్నాడు. రైలు అనుకున్న టైముకు వస్తే ఈ అవస్థ వుండేదికాదు.

అనుకున్నవన్నీ అనుకున్నట్టే అయి పోతే ఈ ప్రపంచం ఇలా వుండదు.

ఈ మనుషులు మనుషులై వుండేవాళ్లు కారు. అనుకున్నవి కాకపోవటం, ఇంకో సారి అనుకోనివి ఎదురవడం యుగ ధర్మం...

యుగధర్మాన్ని అక్షరాలా ఆచర ణలో పెట్టే వ్యక్తి శంకరం. ఇప్పుడు అకస్మాత్తుగా ఎదురయితే...?

'హలో శంకరం...'

............

'ఎలావున్నావురా...?'

'ఏంచెయ్యను, ఇలా అనుకోకుండా బయల్దేరవలసి వచ్చింది. ఉత్తరం రాయ లేకపోయాను...'

............

'క్షమించరా...నాకు తెలుసు నువ్వు చాలా బాధపడతావని...ఒక్క వుత్తరం ముక్కరాసి పడేస్తే పరుగెట్టుకొచ్చే వాడిని స్టేషనుకి...'

............

'పెళ్లి చూపులకి రా ... పెళ్ళి చూపులకి...చిత్రం చూశావా...? మీ వూళ్లోనే...'

............

'ఇప్పుడు చెప్పు ఎలావుంది నీ చెల్లెలు...'

............

'నీ వుత్తరాలన్నీ అందాయిలేవోయ్.. నువ్వొట్టి ఫూల్‌విరా...'

పాపం, శంకరం...!

ఎదురు సమాధానం ఇవ్వలేక పోతున్నాడని జాలేసింది.

హటాత్తుగా శంకరం కనిపించడం నేను కుశలప్రశ్నలు వెయ్యడం అంతా భ్రమే కావొచ్చు...

ఎదురుపడి మాట్లాడినా వాడంతే...! బొత్తిగా నోట్లో నాలికలేదు...

అందుకే వాడంటే నాకు జాలి...!

–ఇలా జాలిపడవద్దనే అనేకసార్లు నాకు వార్నింగ్ ఇచ్చాడు. కాగితంమీద చెరిగిపోకుండా రాసి మరీ వార్నింగ్ ఇచ్చాడు. నేనే కాదు, ఎవరు జాలిపడ్డా వాడు భరించలేడు. ఇలాగే వార్నింగు లిచ్చేస్తూవుంటాడు.

దేవుడు తనకి అన్యాయం చేశాడని ఎవర్నన్నా అంటే-వాడు భరించుకో లేడు.

చదువుంది, సంస్కారం వుంది. వయసుంది ... అన్నీవున్నాయి, కాని, ఏంలాభం...?

దేవుడు వాడ్ని అన్యాయం చేసే శాడు.

వాడ్ని చూస్తుంటే జాలేస్తుంది.

జాలిపడటం వాడి కిష్టముండదు.

వాడికిష్టంలేని పని చెయ్యడం నా కిష్టముండదు. అంచేత జాలిపడ్డం మానేశాను. వాడ్ని తల్చుకున్నప్పుడల్లా గర్వించడం నేర్చుకున్నాను.

అవును, వాడిలో గర్వించతగ్గ విశేషాలు చాలావున్నాయి ఆదర్శంగా

నిలిచే గుణగణాలు వాడిలో అనేకం వున్నాయి

ఉన్న తలిదండ్రుల్ని దూరం చేసు కుంటూ - అన్నదమ్ములని లక్ష్యపెట్ట కుండా-అక్కచెల్లెళ్లని సరకు చెయ్య కుండా-ఎవరిమట్టుకు వాళ్ళు ఏకాంతంగా పొందిదిగా రాచ్చిపల్లా జీవితం వెళ్ళ బోస్తున్న ఈ రోజుల్లో-

జాతిలో సెంటిమెంట్లు ఇంకా సజీవంగానే వున్నాయి. పూర్తిగా చచ్చి పోలేదు-అని చాటి చెప్పే శంకరం నాకు ఆదర్శంగానే కనిపిస్తాడు.

శంకరం రాసిన వుత్తరాలన్నీ స్మృతి పథంలో మెదిలాయి...

'ఒరే రాజూ...

నా చెల్లెలు కనిపించిందిరా, ఇంత కాలానికి నా చెల్లెలు కనిపించింది. ఇంక నేను వూళ్లట్టుకుని తిరగక్కర్లేదు. కళ్లు కాయలు కాచేలా వెతకక్కరలేదు. వెతుకుతున్న తీగ కాళ్లకి తగిలినట్టు నా కళ్ళకి కనిపించింది ఇన్నాళ్లు పడిన శ్రమా-దానికోసం నేను పడిన ఆరాటం అంతా అది కనిపించిన క్షణంలో కలలా అనిపించింది...నిజం...

ఇక్కడ, ఒక పెద్దింటివాళ్లయింట్లో-వాళ్ళ గారాబు కూతురుగా (నా చెల్లెల్లాగా కాదుసుమా) అల్లారు ముద్దుగా-కింద కాలు పెడితే కందిపోతుందేమో అన్నంత సుకుమారంగా-నా కళ్ళకి పండగలా-దీపావళిలా కనిపించిందిరా.

నా అదృష్టాన్ని ఏమని వర్ణించి రాయను? నా ఆనందాన్ని ఎలా తెలియ పర్చను?

నువ్వోసారి రారా, కళ్లారా చూద్దువు గాని. నేను ఇంతకాలం ఎందుకు మగ్గి పోయానో ... చెల్లెలికోసం ఇంతగా ఎందుకు తపించిపోయానో...ఒకసారి చూస్తే నీకే అర్థమవుతుంది. నా చెల్లి బంగారపు బొమ్మరా...బొమ్మ. ఎంత అందంగా వుందనుకున్నావ్ ... చిదిమి దీపం పెట్టొచ్చుననుకో...

ఒరే నువ్వసలే పోకిరీ వేధవ్వి, నీ కళ్ళబడితే తిన్నగా వుండవు, వద్దులే, దూరంగానేవుండు. అక్కడేవుండు.

ఇక, నేనిక్కడనుంచి ఎక్కడికీ వెళ్లక్కరలేదు. నా చెల్లెలు ఎక్కడుంటే అక్కడే నా మకాం ఇదే నా పర్మనెంటు అడ్రసు అనుకో...

వాళ్ళింట్లో ఏదన్నా పని దొరుకు తుందేమోనని చూశాను. వీలు కాలేదు. చెల్లెమ్మ కాలేజీకి వెళ్ళి వచ్చేప్పుడన్నా నా కళ్ళబడుతుందని-ఇక్కడ దగ్గర్లో 'ఉడిపి విలాస్' లో సర్వర్‌గా చేరాను. ఏంచెయ్యను?

పని కొంచెం అలవాటు లేనిదే అనుకో. నాకింక కావలసింది ఏముంది? బ్రతకడం కోసం ఇంత తిండి, ఆ తిండి కోసం ఈ మాత్రం కష్టపడాలిమరి... తప్పదు ... అయినా ఇదేమంత కష్ట మని...? నాచెల్లెమ్మని చూస్తే చాలు...



కష్టమంతా ఎక్కడి దక్కడికి ఎగిరి పోతుంది...

నా చెల్లెలికోసం నే నెలాగూ సంపాదించనక్కరలేదు. గొప్పింటి బిడ్డగా హాయిగా వుంటున్నది. ఇక జీవితంలో నాకు కావలసింది ఏముంది? నా చెల్లెల్ని కంటికి రెప్పలా కాపాడుకోవడం తప్పితే?

అంచేత-ఇక అట్టే నిన్ను కలుసుకోవడం పడదు. రేయింబవళ్లు ఇక్కడే డ్యూటీ...నేను ఏంచేస్తున్నా...నాకళ్లు చెల్లెమ్మ చుట్టూ పరిభ్రమిస్తూ వుంటాయి...

—అంటూ చాలా కాలానికి కనిపించిన చెల్లెలుగురించి తెగపొగుడుతూ సంతోషంతో ఒక్కిరిబిక్కిరవుతూ ఏమేమో రాశాడు

ఉత్తరమంతా చదువుకున్నాక నాకో అనుమానం వచ్చింది,

శంకరం ఒకరకమైన భ్రమలో పడిపోయాడేమో అనిపించింది. నా అనుమానంలో కూడా అర్థం లేకపోలేదు.

చెల్లెలికోసం తపించి తపించి మరీ పిచ్చివాడయిపోయిన శంకరానికి_కనిపించిన వాళ్లల్లా అతని చెల్లెళ్ళే అనుకునే అతని మనస్తత్వానికి నా అనుమానానికి అట్టే దూరంలేదు!

లేకపోతే ఏమిటి?ఎప్పుడోచిన్నప్పుడు

తప్పిపోయిన చెల్లెలు ఇప్పుడు హటాత్తుగా కంటబడిందంటే ఒక్కసారిగా ఎలా నమ్మాలి?

చెల్లెలిమీద మమకారం వుండటం మంచిదేగాని...మరీ ఇంత పిచ్చి ప్రేమ ఎందులోకి దింపుతుందోనని నా భయం.

ఎప్పుడో చిన్నప్పుడు ఏదో తిరునాళ్లలో తప్పిపోయిందట చెల్లెలు. ఇద్దరూ మిఠాయి కొనుక్కున్నారట. తింటూనే రంగులరాట్నం ఎక్కారట... శంకరం దిగాడట... కాని, అతని చెల్లెలు దిగలేదు ... ఏమయిపోయిందో ఏమిటో ఆ పిల్ల అజాపజా లేదు.

అలా వేరుపడిపోయారు అన్నా చెల్లెళ్లు.

ఆ పాపకోసం అరచి అరచి అతని గొంతు పూడుకుపోయింది. ఈ దుర దృష్టాన్ని చూడలేక వున్న తల్లి కాస్తా హరీ అంది.

అప్పటినుంచీ ఆరంభమైంది శంకరం చెల్లెలి వేట.

పోనీలే, ఇప్పటికయినా దొరికింది, అంతేచాలు. ఈ చెల్లెలు అతని నిజం చెల్లెలు అయినా కాకపోయినా శంకరానికి మనశ్శాంతి లభిస్తుంది. అందుకే నాకు ఒక విధంగా ఆనందంగా ఉంది.

వాడి ఉత్తరానికి సమాధానంగా అదే రాశాను. నీకు మనశ్శాంతి లభిస్తున్నందుకు సంతోషంగా వుంది అని!

వాడికి కోపం వచ్చినట్టుగా వుంది.

'నేను అంత ఫూల్‌ని కాదు. నా చెల్లెల్ని గుర్తించలేనంత మూర్ఖుణ్ని కాను. నీకు రుజువులు కావాలా? సాక్ష్యాలు చూపించమంటావా? పరాయి పిల్లకి- అచ్చం నా చెల్లెల్లాంటి పిల్లకి 'శాంత' అని నా చెల్లెలు పేరు పెట్టుకుంటారా? అచ్చుగుద్దినట్టు పిల్లల్ని సృష్టించడానికి ఇక్కడేం ప్రింటింగు మిషను లేదు...'

అంటూ చెడామడా రాశాడు.

నాకు నవ్వొచ్చింది

నిజమేనేమో అనుకున్నాను. నాదే పొరపాటేమో అని సమర్థించుకున్నాను.

శంకరం దగ్గర్నుంచి ఉత్తరాలు వస్తూనేవున్నాయి. చెల్లెలి అందచందాల గురించి - చదువు సంధ్యల గురించి గుణగణాల గురించి - ఏకరువు పెరుతూనే వుండేవాడు.

అన్ని ఉత్తరాలు చదివాక నాకు మళ్లీ ఓ అనుమానం పుట్టుకొచ్చింది. కాని, వాడికి వుత్తరంలో రాయలేదు. నాలో నేనే తర్కించుకున్నాను.

చెల్లెని గురించి అంతా వర్ణించి రాసేవాడు కాని, ఏ వుత్తరంలోనూ చెల్లెలు మాట్లాడినట్టుగాని - ఆమె అలా అన్నదనిగానీ - ఇలా చెప్పిందనిగానీ ఏమీ వుండేదిగాదు. అసలు వీడు ఆఅమ్మాయిని పలకరించనన్నా పలకరించాడా? దూరాన్నుంచే అభిమానం కురిపిస్తున్నాడా?- అని!

నేను పోకిరీ వాడినని వాడు సర్టిఫై చెయ్యనే చేశాడు. ఎక్కువగా రాయడం

ప్రమాదకరమని ఈ వివరాలు రాయడం మానేశాడా?

అలా ఎందుకవుతుంది? ఆమె అందచందాల గురించి రాసినవాడు ఏమందో రాస్తే వచ్చే ప్రమాదమేముంటుంది?

శంకరం తలంపులో పరిసరాల్ని, వాతావరణాన్ని మరచిపోయాను. అందుకు వాడికి థాంక్స్ చెప్పుకున్నాను.

రోడ్డు వదిలి చిన్న కాలిబాటలోకి మళ్లింది నా నడక. అంటే, వూరికి దగ్గరలో వున్నానన్న మాట...,

దారి సన్నంగా ఇరుగ్గావుంది. ఎడా పెడా గుబురుగా పెరిగిన డొంకలు నడుస్తుంటే రాసుకుంటున్నాయి.

ప్రక్కనే - డొంకలో ఎక్కడో 'హిస్స్స్...' మన్న శబ్దం వినిపించింది. మరుక్షణంలో దారి కడ్డంగా ఒక పెద్ద పొడవాటి తెల్లని తాడులాంటిదేదో పాకిపోయింది!

పళ్లు జివ్వుమన్నాయి.

వళ్లు కంపరమెత్తింది.

గుండె దడదడలాడింది

ఆలోచనలన్నింటికి బ్రేక్ పడిపోయింది.

మళ్లీ చలి...

చలితో భయం...! భయంలో ఆకలి ...మళ్లీ మొదలు...!

ఊళ్లోకి వచ్చేసిన తర్వాత ప్రాణం కుదుటపడింది:

'హమ్మయ్య' అనుకున్నాను.

ఇప్పుడు ఎంతో తేలిగ్గావుంది. వింత ఆనందంగా వుంది. పెళ్లిచూపులకి వచ్చినట్టుగా అనిపించింది ఈ క్షణంలోనే!

చలి కొంచెం తగ్గినట్టేవుంది.

బూటులేస్‌లు గట్టిగా ముడివేశాను. మఫ్లర్ కొద్దిగా బిగించాను. కోటు సర్దుకున్నాను. భుజానికి వేలాడే ఎయిర్ బాగ్‌ని ఆర్డర్‌లో పెట్టాను.

నడకవేగం తగ్గించి ఇళ్లమధ్యనుంచి వెళ్తున్నాను.

ఊరంతా గాఢంగా నిద్రపోతోంది. టైము చూసుకున్నాను. రెండయింది.

రెండు గంటలకి ఆవూళ్లో తిరిగే మనిషి ఎవరూ కనిపించలేదు, నేను తప్పితే!

ఊరంతా వొకటి...నేను ఒక్కడ్నీ ఒకటి! చిత్రంగా వుంది.

ఇంకొంచెం దూరం వెళ్తే నా గమ్యస్థానం వచ్చేస్తుంది. ఇంత రాత్రికాడ ప్రయాణం పెట్టుకున్నందుకు అంతా ఎంతో నొచ్చుకుంటారు...

హటాత్తుగా ఎక్కడినుంచో పెద్ద గొడవ వినిపించింది. ఆ కలకలం అంతకంతకి దగ్గరవుతున్నది. ఎవళ్లో హడావిడిగా పరుగెడుతున్నారు. అంతా గందరగోళంగా వినిపిస్తున్నది.

ఏ ఖూనీయో జరిగివుంటుంది అనుకున్నాను ఆ గొడవ చూసి.—

అలా అనుకుంటుండగానే నాముందునుంచి ఓ యువకుడు బాణంలా దూసుకు

పోయాడు. నేను అతను వెళ్ళిన డక్కాగా చూసేంతలో ఒక గుంపు నన్ను తోసుకుంటూ - పరుగెత్తుకెళ్ళిన ఆ యువకుడి వేపు తరలిపోయింది. వాళ్ళని తప్పించుకుని రోడ్డుపక్క నిలబడ్డాను. అంతా ఒక లిప్తలో జరిగిపోయింది.

'పట్టుకోండి...'

'తన్నండి రాస్కెల్‌ని...'

'చెట్టుకు కట్టెయ్యండి'

'తన్నండిరా తన్నండి...'

'ఒంటరిగా వున్న ఆడపిల్లమీద ఇంత అఘాయిత్యమా.. ?'

'పోకిరీ వెధవలు పిదప బుద్ధులు...'

'చెట్టుకు కట్టేసి తన్నండి. అప్పుడుగాని బుద్ధిరాదు..."

'ప్రపంచం ఇలా తగులడిపోతోందేం?'

—గుంపులోనుంచి నిప్పు రవ్వల్లా బయటికి వస్తున్నాయి మాటలు. అర్థం చేసుకోడానికి నాకు ఆట్టే టైము పట్టలేదు.

గుంపంతా ఒక చోట ఆగిపోయింది. అందేవాళ్లు సాధించాల్సింది సాధించారు. యువకుడ్ని పట్టుకున్నారు. కట్టేసే ప్రయత్నంలో వున్నారు.

నేనూ గుంపుదగ్గరకి చేరాను. కాని, లోపలకి వెళ్లే ఆస్కారమూ లేదు, నాకు ఆ ధైర్యమూలేదు. గుంపుని చూసే ప్రేక్షకుడిలా నిలబడిపోయాను.

గుంపులో వాళ్లమాటల్ని బట్టి—ఆ యువకుడ్ని కట్టేసినట్టు అర్థమైపోయింది.

జనంలో ఒకే ఉద్రేకంతో...ఆవేశపడిపోతున్నారు. పెట్రోలు పొయ్యండని ఒకడు...తగలెట్టండని ఒకడు...ఎవళ్ల యిష్టమొచ్చినట్టు వాళ్లు వారివారి ఆవేశాన్ని ప్రదర్శిస్తున్నారు.

ఆ యువకుడి ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు. ఆ యువకుడు మాట్లాడితే ఒట్టు!

ఎవరో చొక్కా చింపేశారు. ఇంకొకడు సైకిల్ చైన్‌తో ప్రత్యక్షమయ్యాడు.

ఎప్పుడో కంచికిచెర్ల గురించి విన్నాను. ప్రత్యక్షంగా ఇప్పుడు చూడబోతున్న ఈ హింసాకాండ నన్ను భయకంపితుడ్ని చేసింది.

అక్కడ ఒక్క క్షణం కూడా నిలవబుద్ధి కాలేదు.

కాబోయే మామయ్యగారింటికి వచ్చిపడ్డాను. వాళ్ల హడావిడి వర్ణనాతీతం. ఎక్కడలేని ఆప్యాయతా - అనురాగం కురిపించెయ్య సాగారు. అంతా మేలుకునే వున్నారు.

నాకు ఏమిటోగా వుంది. హృదయంలో దేవుతున్నట్టు అనిపించింది. చూసిన సంఘటన మనసులో ముద్ర వేసుకుంది. వాళ్లు - గుంపులో వాళ్లు అన్నంతపనీ చేసేస్తే-? అక్కడో ప్రాణం హరీ అంటుంది. కళ్లెదుట ఇంత

చిత్రహింస...! భరించుకోలేక పోయాను.

నా పరిస్థితి గమనించినట్టుగావున్నారు ఇంట్లోవాళ్లు.

జరిగిందంతా ఏకరువు పెట్టారు.

అది మావయ్యగారి ఇంటికి సంబంధించిన ఉదంతమే.

ఆ అబ్బాయి అల్లరిపెట్టిన అమ్మాయి ఎవరో కాదు... నేను పెళ్లిచూపులకని వచ్చినమ్మాయే...!

రోజూ కాలేజికి వెళ్లేప్పుడు వచ్చేప్పుడు వెకిలి చూపులు చూస్తుండేవాడట...వెర్రి ఆవేశంతో ఆమెదగ్గరకంటా వచ్చి అసభ్యంగా ప్రవర్తిస్తుండేవాడట...వల్లమాలిన ప్రేమ వలకబోస్తూ వుండేవాడట...

ఇప్పుడు మరీ బరితెగించాడు...!

ఇంత రాత్రివేళ వచ్చి అమ్మాయి వంటి మీద చెయ్యివేసి లేపబోయాడట...! ఎంత తెగింపు!

దాంతో – ఈ గుంపంతా మళ్ళింది.

అదే సమయంలో ఇంట్లోనుంచి ఒక గావుకేక వినిపించింది.

ఆడవాళ్లంతా లోపలికి పరుగెట్టుకెళ్లారు. వాళ్లతోపాటు నేనూ...

స్పృహతప్పి పడిపోయిన కూతురు దగ్గరకి పరుగెత్తుకెళ్లింది అత్తయ్య.

నేను ముఖంమీద నీళ్లు జల్లాను. పెళ్లిచూపులకని వచ్చిన అమ్మాయిని ఇలా చూసినందుకు కొంచెం బాధగానే వుంది.

ఆ అమ్మాయి కొంచెం తెప్పరిల్లింది.

'ఏమిటి శాంతా ఏమయిందే?' పలకరించింది అత్తయ్య.

శాంత సమాధానం చెప్పలేదు. భయం భయంగా ఒకమూలకి చూసింది.

ఆ వైపు చూశాను.

చచ్చి పడివున్న ఒక పెద్ద తాచుపాము కనిపించింది!

శాంత – చచ్చిపడిన తాచుపాము – అక్కడ దారుణ సంఘటన ఒక్కసారిగా నా మనసులో కదంతొక్కాయి.

నా ప్రాణాలు పైకే పోయాయి.

'అత్తయ్యా... అతను పేరుపెట్టి పిలిచాడా...ఏమన్నా అన్నాడా?' అనడిగాను అత్రుత నణచుకోలెక.

'లేదు...అసలేమన్నా నోరెత్తితేనా. అలాగే కొయ్యబొమ్మలా నిలబడిపోయాడు నేను అరిచి గోలచేశాను. ఈలోపులో మీ మావయ్య అందిపుచ్చుకున్నారు...' అంది.

ఆ క్షణంలో నాకు ప్రపంచమంతా శూన్యంగా అనిపించింది. నేను ఎక్కడికో పాతాళానికి దిగిపోతున్నట్టుగా అయింది.

క్షణం ఆగకుండా వీధిలోకి పరుగెత్తాను

అప్పటికే గుంపులో జనం ఆవేశం తారాస్థాయికి చేరుకున్నట్టుంది... దారుణం జరిగిపోయింది...

పెట్రోలు మంటలు భగ్గున లేచాయి.

'శంకరం' అని అరిచి కళ్లు మూసుకున్నాను.

హృదయం ద్రవించి పోయింది. నాకు తెలియకుండా ఏడుపు వచ్చేసింది. భోరుమని ఏడ్చేశాను.

మావయ్య నన్ను గుర్తుపట్టేడులా వుంది... దగ్గరికి వచ్చాడు.

''ఏరా...రాజూ, నీకా అబ్బాయి తెలుసా ? ఏం చెయ్యను ? జనాన్ని ఎంత అదుపులో పెడదామన్నా వీల్లేకపోయింది. అంతా ప్రారబ్ధం...'

—అంటూ తన బాధనంతా వెళ్ల గ్రక్కాడు.

జనం ఎంత తొందరగా మూగారో - హింసాకాండ జరిగాక అంత తొందరగానూ తప్పుకోసాగారు.

'దేవుడు లాంటి మనిషిరా...ఈ పాడుబుద్ధి ఎలా పుట్టిందో మరి...'

'అంత మంటల్లో మాడి మసై పోతున్నా - నోరు మెదిపితేనా ? ఇష్టంగానే చచ్చిపోయాడేమో...'

'ఏడిశాడు...ఏమని నోరెత్తుతాడు ? నోరెత్తితే వూరుకుంటామా...?'

—ఇలా సాగిపోతున్నాయి వెళ్లిపోయేవాళ్ల మాటలు ...

—'వాడు నోరు త్తితే ఇలా జరిగి వుంటుందా ? నోరులేని వాడు కాబట్టే ఇంత దారుణం చెయ్యగలిగారు...' అన్నాను ఏడుస్తూనే.

'ఏమిట్రా నువ్వనేది ?' అనడిగాడు మావయ్య.

'అవును మావయ్యా...వాడికి నోరు లేదు. మూగవాడు...' అన్నాను చేతుల్లో ముఖాన్ని కప్పుకుంటూ.

తెల్లగా తెల్లారిపోయింది. చీకటిని మనుషుల మనస్సులోకి తోసి తెల్లగా తెల్లారి పోయింది.

నాకిప్పుడు ఆకలి వెయ్యడం లేదు. అయినా చలి...విపరీతమైన చలి...

ఎదురింటి కుర్రాడెవరో 'పాము - ముంగిస' పాటం చదువుతున్నాడు.

మొట్టమొదటి సారిగా ఆ పాఠమంటే భయం పుట్టుకొచ్చింది.

భయమూ చలీ కలిసి నన్ను గజగజ లాడించేస్తున్నాయి.

చలిలో చెమట్లు...వళ్లంతా చెమట్లు..!

ఈ జబ్బేమిటో ఏ డాక్టరికీ అంతుపట్టదు... !

ఈ మనుషుల్లో వున్నంత కాలమూ ఇంతేనేమో !

—